తెలుగు దినపత్రిక
jayabheridaily.com
ప్రభాత
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
సంపుటి : 01
సంచిక : 224
పేజీలు : 5
వెల : 4
మల్కాజిగిరి
శుక్రవారం, 29-03-2024

KISHAN COMPUTERS
SALES & SERVICE
Computers, Laptop Repair
Mother Board Repair,
Printers Repair,
Catrige Refilling,
New Catriges,
Ink Bottles, Accessories

Near MRO Office, Opp. Shamirpet Lake,
Shamirpet Mandal, Medchal Dist.
Cell: 80994 82143, 99488 05009



# ఒక్క విజయం కోసం పరితపన

జయభేరి, హైదరాబాద్, మార్చి 28:


తెలంగాణ సీఎం కేసీఆర్ వ్యక్తిగతంగా, రాజకీయంగా తీవ్రమైన సవాళ్లను ఎదుర్కొంటున్నారు. ఆయనకు అన్ని దారులు మూసుకుపోయాయన్న అభిప్రాయం ఉంది. కానీ రాజకీయాల్లో ఒకే ఒక్క విజయంతో అన్ని దారులూ తెరుచుకుంటాయి. ఒక్క విజయంతో అన్నీ ప్లస్ అవుతాయి. కేసీఆర్ కు కూడా ఇప్పుడు అలాంటి అవకాశం పార్లమెంట్ ఎన్నికల ద్వారా వచ్చింది. ఈ ఎన్నికల్లో ఆయన స్వీప్ చేయాల్సిన పని లేదు. నాలుగైదు సీట్లు తెచ్చుకుని గట్టి ప్రభావం చూపించగలిగితే చాలు.. పరిస్థితులన్నీ మళ్లీ సానుకూలంగా మారుతాయి. ఇప్పుడు అలాంటి ప్రభావం చూపించేందుకు కేసీఆర్ కు ఎన్నో సవాళ్లు ఉన్నాయి. కేసీఆర్ పోరాటం చేస్తున్నారు. 17 ఎంపీ స్థానాలకుగానూ ముగ్గురు సిట్టింగులకు బీఆరెస్ అధినేత అవకాశం కల్పించారు. ఖమ్మం, మహబూబాబాద్, మహబూబ్నగర్ స్థానాలు సిట్టింగ్లకు ఇచ్చారు. కరీంనగర్ సీటు గత ఎన్నికల్లో పోటీచేసిన బీ వినోద్కుమార్కు అభ్యర్థికి కేటాయించారు. ఇక మిగిలిన 13 స్థానాలు కొత్తవారిని బరిలో దింపారు. ఎంపీ టికెట్ కోసం పార్టీలో కనీస పోటీ లేదని పార్టీ వర్గాల్లోనే చర్చించుకోవడం గమనార్హం.

...మిగతాది 2 లో

# కేజ్రీవాల్ కస్టడీని పొడిగింపు

జయభేరి, న్యూ ఢిల్లీ మార్చ్ 28:


మద్యం పాలసీ కేసులో అరెస్టయిన ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ కస్టడీని రౌస్ అవెన్యూ కోర్టు పొడిగించింది. కస్టడీ గడువు ముగియడంతో ఆయనను ఈడీ కోర్టు ఎదుట హాజరుపరిచింది. ఈ సందర్భంగా అరవింద్ కేజ్రీవాల్, ఈడీ వాదనలు వినిపించాయి. ఈడీ విజ్ఞప్తి మేరకు కోర్టు ఏప్రిల్ ఒకటి వరకు కస్టడీని పొడిగిస్తూ తీర్పును వెలువరించింది. విచారణ సందర్భంగా కేజ్రీవాల్ వాంగ్మూలం ఇస్తూ.. సీబీఐ ఆగస్టు 17, 2022న కేసు నమోదు చేసిందని తెలిపింది. ఈడీ 2022 ఆగస్టు 22న ఈసీఐఆర్ దాఖలు చేసిందని తెలిపారు. నన్ను అరెస్టు చేసినా.. ఇప్పటి వరకు ఏ కోర్టు దోషిగా తేల్చలేదన్నారు. తనను ఎందుకు అరెస్టు చేశారని అడగాలనుకుంటున్నానన్నారు. కేవలం నలుగురి ప్రకటనల్లోనే తన పేరు కనిపించిందని చెప్పారు. ఈడీ రూ.100కోట్ల ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఈడీ విచారణ తర్వాతే అసలైన మద్యం కుంభకోణం ప్రారంభమైందని కేజ్రీవాల్ ఆరోపించారు. ఆమ్ ఆద్మీ పార్టీని నాశనం చేయడమే ఈడీ లక్ష్యమని.. ఈడీ బెదిరింపులకు పాల్పడుతోందని ఆయన ఆరోపించారు.



...మిగతాది 2 లో

# పోలీసుల అదుపులో మరో ఇద్దరు అధికారులు





జయభేరి, హైదరాబాద్, మార్చి 28:

రాష్ట్రంలోనే సంచలనం కలిగించిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో గురువారం మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో మరో ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. టాస్క్ ఫోర్స్ మాజీ డీసీపీ రాధాకిషన్ రావు, గట్టు మల్లును అదుపులోకి తీసుకుని బంజారా హిల్స్ పోలీస్ స్టేషన్ లో విచారిస్తున్నారు. గతంలో ఎస్ఐబీ సీఐగా పని చేశారు. ఈ కేసులో ప్రధాన సూత్రధారిగా ఉన్న ఎస్ఐబీ మాజీ డీఎస్పీ ప్రణీత్ రావుతో వీరికి ఉన్న సంబంధంపై ప్రత్యేక దర్యాప్తు బృందం ఆరా తీస్తోంది. ఈ కేసులో ఇప్పటికే ప్రణీత్ రావుతో పాటు అదనపు ఎస్పీలు భుజంగరావు, తిరుపతన్నను అరెస్ట్ చేశారు. గతంలో ప్రముఖుల ఫోన్లను ట్యాప్ చేసి వారి వ్యక్తిగత విషయాలపై నిఘా పెట్టి, ప్రభుత్వం మారిన తర్వాత వీరు ఆ హార్డ్ డిస్క్ లను ధ్వంసం చేశారని ఆరోపణలున్నాయి. ప్రణీత్ రావును విచారించిన అధికారులు.. అతను ఇచ్చిన సమాచారం ఆధారంగా లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. అటు, భుజంగరావు, తిరుపత న్నను కస్టడీకి ఇవ్వాలని కోరుతూ పోలీసులు దాఖలు చేసిన పిటిషన్ పై నాంపల్లి కోర్టులో బుధవారం

# హైదరాబాద్ ఎన్నికల ప్రవర్తనా నియమావళి

- రూ. 23,92,610 నగదు పట్టివేత
- జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రోస్

జయభేరి, హైదరాబాద్:

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి లో భాగంగా హైదరాబాద్ జిల్లాలో గడిచిన 24 గంటల వ్యవధిలో వివిధ ఎన్నికల ఎన్ఫోర్స్మెంట్ బృందాల తనిఖీ సందర్భంగా మొత్తం 23 లక్షల 92 వేల 610 రూపాయలు నగదు తో పాటు 14 లక్షల 66 వేల, 994 రూపాయల విలువ గల ఇతర వస్తువులు పట్టుకొని సీజ్ చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, జిహెచ్ఎంసి కమిషనర్ రోనాల్డ్ రోస్ తెలిపారు. ఈ నెల 27వ తేదీ ఉదయం 6 గంటల నుండి 28వ తేదీ ఉదయం 6 గంటల వరకు గడిచిన 24 గంటల వ్యవధిలో ఫ్లయింగ్ స్క్వాడ్ ద్వారా 1,01,610 రూపాయలు, పోలీస్ శాఖ ద్వారా 19,61,000 రూపాయలు, యస్ యస్ టి బృందాల ద్వారా 3,30,000 రూపాయల నగదు పట్టుకొని సీజ్ చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు. పోలీస్, ఇతర తనిఖీ బృందాలు 14,66,994 రూపాయల విలువ గల ఇతర వస్తువులు పట్టుకొని సీజ్ చేశారు. నగదు, ఇతర వస్తువుల పై 10 ఫిర్యాదులు రాగా వాట న్నింటినీ పరిశీలించి పరిష్కరించడం జరిగింది. అదే విధంగా 5 ఎఫ్ ఐ ఆర్ లు నమోదు చేసినట్లు హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి పేర్కొన్నారు. నోటిఫికేషన్ జారీ చేసినప్పటి నుండి గత గడిచిన 24 గంటల వరకు ఫ్లయింగ్ స్క్వాడ్ ద్వారా ఇప్పటి వరకు 1,68,300 రూపాయలు, పోలీస్ శాఖ ద్వారా 1,68,65,300 రూపాయల యస్ యస్ టి ద్వారా 4,80,000 రూపాయల నగదు మొత్తం 2,80,9800 రూపాయల నగదు సీజ్ చేశారు. అంతేకాకుండా 51,72,283.5 రూపాయల విలువ గల ఇతర వస్తువులు పట్టుకొని సీజ్ చేశారు. గడిచిన 24 గంటలలో 131.19 లీటర్ల మద్యం పెట్టుకోవడమే కాకుండా 2 కేసులు నమోదు చేసి ఒకరిని అరెస్టు చేశారు. ఇప్పటి వరకు 109 కేసులు నమోదు చేయడమే కాకుండా 110 మందిని అరెస్టు చేశారు. ఇప్పటి వరకు 129 మంది పై ఎఫ్ ఐ ఆర్ నమోదు చేసినట్లు 166 ఫిర్యాదులు పరిశీలించి పరిష్కారం చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కమిషనర్ జిహెచ్ఎంసి రోనాల్డ్ రోస్ తెలిపారు.



# ఇది కాంగ్రెస్ తెచ్చిన కరువు

- కేటీఆర్

జయభేరి, సిరిసిల్ల:

రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి మండలం సారంపల్లి గ్రామంలో ఎండిన వరి పొలాలను మాజీ మంత్రి కెటిఆర్ పరిశీలించారు. కెటిఆర్ మాట్లాడుతూ చేస్తానన్న రుణమాఫీ చేయలేదు కదా, బ్యాంకుల ద్వారా నోటీసులు ఇప్పిస్తూ, మెడపైన కత్తి పెట్టి రుణాలు కడతారా చస్తారా అన్నట్లు ఉంది. ఎండిన పోయిన పది పదిహేను లక్షలు ఎకరాలను రాష్ట్రవ్యాప్తంగా మా ఎమ్మెల్యేలతో పరిశీలుస్తున్నాం. రైతులను చూస్తే నిజంగానే బాదేస్తుంది. ఇది కాలం తెచ్చిన కరువు కాదు, ముమ్మాటికి కాంగ్రెస్ తెచ్చిన కరువు. మేడిగడ్డ వద్ద కుంగిపోను మూడు పిల్లర్లు వద్ద కాపర్ డామ్ కడితె అయిపోయేది. ఢిల్లీకి జాతరలు , యాత్రలు తప్పితే రాష్ట్రానికి రేవంత్ చేసిందేమీ లేదు. కౌలు రైతులు, రైతులకు చేస్తానన్న లబ్ధి చేకూర్చాలి. రైతులకు ఇస్తా నన్న క్వింటాలుకు 500 బోనస్ వెంటనే ఇవ్వాలి. రైతులు ధైర్యంగా ఉండండి మేం ఉన్నాం. రైతులు ఆత్మహత్యలు లాంటి తీవ్రమైన చర్యలకు పాల్పడవద్దని అన్నారు.

# మేడ్చల్ లో వేడెక్కిన రాజకీయం

జయభేరి, హైదరాబాద్, మార్చి 28

మేడ్చల్ నియోజకవర్గం చెంగిచెర్ల గ్రామంలో హోలీ పండుగ సంర్భంగా మహిళలపై మరో వర్గం వారు దాడికి ప్రయత్నించారన్న ఆరోపణలు రావడం రాజకీయంగా బీజేపీకి గొప్ప అవకాశంగా మారింది. బీజేపీ నేతలు వరుసగా చెంగిచెర్లను సందర్శిస్తూండటంతో.. విషయం అంత కంతకూ పెద్దదవుతోంది. మొదట కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి బాధితులను పరామర్శించారు. మహిళలు హోలీ పండుగ చేసుకుంటుంటే.. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కొంతమంది మహిళలతో ఘర్షణకు దిగి దాడికి పాల్పడ్డార ఈ దాడిలో గర్భిణిలతో పాటు మహిళలకు తలలు పగిలి తీవ్ర గాయాలయ్యాయని కిషన్ రెడ్డి ఆరోపించారు. తర్వాత బండి సంజయ్ బుధవారం పిలుపునిచ్చి మరీ చెంగిచెర్ల వెళ్లారు. బండి పిలుపుతో.. పెద్ద



ఎత్తున బీజేపీ నేతలు, హిందూ సంఘాల నేతలు రావడంతో పోలీసులు వారిని అడ్డుకున్నారు. పోలీసులు ఎన్ని నిర్బంధాలు ఏర్పాటు చేసిన బండి సంజయ్ వాటిని దాటుకుని పోలీసులను తోసుకుని ముందుకు సాగాడు. అనంతరం బండి సంజయ్ ముస్లిం యువకుల దాడిలో గాయ పడిన వారి ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. బండి సంజయ్ బారికెడ్లను తోసుకుంటూ పోలీసులను గాయపర్చి లోపలికి వెళ్లారని.. తమ విధులకు ఆటంకం కలిగించారని సీఐ నందీశ్వర్ రెడ్డి ఫిర్యాదు మేరకు బండి సంజయ్ పై మేడిపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ వివాదానికి కొనసాగింపుగా రాజాసింగ్ అక్కడకు వెళ్లేందుకు ప్రయ త్నించడంతో ఆయనను హౌస్ అరెస్ట్ చేశారు. కేంద్ర ఎలక్షన్ కమిషన్ దృష్టికి తీసుకెళ్తామని, బాధితులకు న్యాయం జరగకుంటే ఎంతవరకైనా పోరాడుతామని కేంద్ర మంత్రి హెచ్చరించారు. ఈ క్రమంలో ఇరు వర్గాల మధ్య ఘర్షణ నెలకొంది. ఒకరిపై ఒకరు దాడి చేశారు. ఘటనకు సంబం ధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్గా మారాయి.

▶▶ మొదటిపేజీ తరువాయి

## ఒక్క విజయం కోసం పరితపన

ఓడిపోయే స్థానానికి పోటీ ఎందుకనే అభిప్రాయంతో పలువురు నేతలు ఉన్నారన్న చర్చలూ నడిచాయి. వలసలను నివారించేందుకు బుజ్జగింపులు చేసినా ప్రయోజనం లేకుండా పోతోంది. చేవెళ్ళ టికెట్ రంజిత్ రెడ్డికి బీఆరెస్ ముందుగా డిక్లేర్ చేసినప్పటికీ ఆ పార్టీని కాదంటూ అధికార కాంగ్రెస్లో చేరిపోయి ఆ పార్టీ నుంచి పోటీకి సిద్ధమయ్యారు. వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్ పార్టీ మారుతున్నారని తెలిసి ఆయనను బలవంతంగా కేసీఆర్ దగ్గరికి తీసుకెళ్ళి బుజ్జగించినా.. ఆ తర్వాత బీజేపీలో చేరిపోయారు. ఆ పార్టీ వరంగల్ ఎంపీ అభ్యర్థిగా మారిపోయారు.అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిపాలై అధికారం కోల్పోయిన భారత రాష్ట్ర సమితి అగ్నిపరీక్షను ఎదుర్కొంటున్నది. పదేండ్లు రాష్ట్రాన్ని ఏకచత్రాధిపత్యంతో పాలించిన కేసీఆర్ తన రాజకీయ జీవితంలో ఎన్నడూ లేనంత ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి నుంచి కోలుకోకముందే లోక్సభ ఎన్నికలు పార్టీ మనుగడకే సవాల్ విసురుతున్న పరిస్థితి కనిపిస్తున్నది. లోక్సభ ఎన్నికల్లో గణనీయ ఫలితాలు సాధించని పక్షంలో పార్టీ ఉనికి ప్రశ్నార్థకమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. దశాబ్దంన్నర పాటు తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అలుపెరుగని పోరాటం చేయడంలో కేసీఆర్, నాటి టీఆరెస్ పాత్ర తక్కువేమీ కాదు. రాష్ట్రం సిద్ధించిన అనంతరం అప్రతిహతంగా రెండు పర్యాయాలు అధికారంలో ఉన్నది. మూడోసారి అనూహ్యంగా పరాజయం పాలయ్యారు. తీవ్రమైన ఓటమి నుంచి ఆ పార్టీ కోలుకోకముందే నాలుగు నెలల స్వల్పకాలంలోనే పార్లమెంట్ ఎన్నికలు ముంచుకురావడం సవాల్గా మారింది. నిజానికి ఇలా రావడం గతంలో ఆయన వ్యూహమే. అప్పట్లో ప్లస్ అయిందేమో కానీ ఇప్పుడు మైనస్గా మారుతోంది. కేసీఆర్ కుమార్తె కల్వకుంట్ల కవిత ఢిల్లీ లిక్కర్ పాలసీ కుంభకోణంలో ఇరుక్కోవడం ఎన్నికల ముందు ఎజెండా కాగా, ఎన్నికల తర్వాత రాద్ధాంతంగా మారింది. తాజాగా కవిత అరెస్టు, జైలు ఆ పార్టీని మరింత ఇబ్బందుల్లోకి నెట్టాయి. మరో వైపు ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం మెడకుచుట్టుకుంటోంది. ఇలాంటి ఇబ్బందికరమైన వాతావరణం నెలకొననగా గోరుచుట్టుపై రోకటిపోటులా పార్టీ నుంచి భారీ స్థాయిలో నాయకులు, కార్యకర్తలు వలసపోవడం ఇబ్బందిగా మారింది. అటు బీజేపీ, ఇటు కాంగ్రెస్ పార్టీలకు పెద్ద సంఖ్యలో సాగుతున్న వలసలు గులాబీ నాయకత్వానికి కంటి మీద కునుకులేకుండా చేస్తున్నాయి. ఎన్నికల ఫలితాలు వెలువడగానే బీఆరెస్ ఎమ్మెల్యేలుగా గెలిచిన మాజీ మంత్రి కడియం, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డితో పాటు పలువురు నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోతోందని జోస్యాలు చెప్పడం ప్రారంభించారు. ఇప్పుడు ఆ మాటలే బీఆరెస్కు ఇబ్బందిగా మారాయి. నైతికత అంశాన్ని పక్కకుపెడితే తమ ప్రభుత్వ రక్షణకు ఫిరాయింపులను ప్రోత్సహించక తప్పలేదంటూ గేట్లు ఎత్తుతున్నట్లు ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి.. సికింద్రాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ను కాంగ్రెస్లో చేర్చుకున్నారు. తాజాగా నాగేందర్ను సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థిగా ప్రకటించడం రాజకీయ కలవరానికి దారితీసింది. పలువురు సిట్టింగ్ ఎంపీలు కూడా పార్టీని వీడారు. అటు బీజేపీ, ఇటు కాంగ్రెస్ పార్టీలో చేరిపోయారు. . మెజార్టీ సిట్టింగ్ ఎంపీలు రెండు పార్టీల్లోకి జంప్ అయ్యారు. కేసీఆర్ ఇలాంటి పరిస్థితులను గతంలోనూ ఎదుర్కొన్నారు. మళ్లీ ఎదిగారు. ఈ సారి ఆయనకు లోక్ సభ ఎన్నికలు ఆ చాన్స్ ఇస్తున్నాయి. తనకు ప్రజాభిమానం ఇంకా మెండుగా ఉందని నిరూపిస్తే.. ఆయనపై దూసుకొస్తున్న ఆయుధాలన్నీ స్లో అయ్యే అవకాశం ఉంది. ఇప్పుడు మళ్లీ వెలిగిపోయే అయ్యే అవకాశం కేసీఆర్ చేతుల్లో ఉన్నట్లే అనుకోవచ్చు. కానీ అదంతా తేలిక కాదు.. కానీ అసాధ్యం కాదు. కేసీఆర్ అలసిపోలేదని నిరూపించుకునే అవకాశం అని కూడా అనుకోవచ్చు.

## కేజ్రీవాల్ కస్టడీని పొడిగింపు

ఈడీ దోపిడీ రాకెట్ సాగుతోందని కేజ్రీవాల్ అన్నారు. కేజ్రీవాల్ ప్రకటనను ఈడీ వ్యతిరేకించింది. గోవా ఎన్నికలకు హవాలా ద్వారా డబ్బులు వినియోగించారని ఈడీ తెలిపింది. కేజ్రీవాల్ మొత్తం విచారణను గందరగోళానికి గురి చేయాలనుకుంటున్నారని.. ఈ అంశం ఇంకా దర్యాప్తు దశలోనే ఉందని ఈడీ పేర్కొంది. గోవా ఎన్నికలకు రూ.100కోట్ల సొమ్మును ఆమ్ ఆద్మీ పార్టీకి అందినట్లుగా ఈడీ ఆరోపించింది. మొబైల్ డేటాను రికవరీ చేసినట్లు ఈడీ పేర్కొంది. పలు డివైజ్లలో ఉన్న డేటాను రికవరీ చేయాల్సి ఉంది పేర్కొంది.

## పోలీసుల అదుపులో మరో ఇద్దరు అధికారులు

వాదనలు ముగిశాయి. దీనిపై న్యాయస్థానం తీర్పు రిజర్వ్ చేసింది.కాగా, ఈ వ్యవహారానికి సంబంధించిన కీలక సూత్రధారిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు తాజాగా ఓ ఉన్నతాధికారికి ఫోన్ చేసినట్లు సమాచారం. ఈయన ప్రస్తుతం అమెరికాలో ఉన్నారు. ఈ సందర్భంగా తాను క్యాన్సర్ చికిత్స కోసం అమెరికాకు వచ్చానని.. జూన్ లేదా జులైలో తిరిగి హైదరాబాద్ కు వస్తానని చెప్పినట్లు తెలుస్తోంది. 'ఇప్పుడు ప్రభుత్వం చెప్తే మీరు ఎలా పని చేస్తున్నారో అప్పటి ప్రభుత్వం చెప్తే మేం కూడా అలాగే చేశాం.' అని సదరు ఉన్నతాధికారితో అన్నట్లు సమాచారం. అంతే కాకుండా, ఎంతైనా మన పోలీసులం ఒకటని.. మా ఇళ్లల్లో సోదాలు ఎందుకు చేస్తున్నారని కూడా అడిగినట్లు తెలుస్తోంది. అయితే, ప్రభాకర్ రావు ఫోన్ కు స్పందించిన ఉన్నతాధికారి.. 'మీరు ఏదైనా చెప్పదల్చుకుంటే అధికారిక మెయిల్ కు సమాధానం రాసి పంపించండి.' అని స్పష్టం చేశారట. దీంతో ప్రభాకర్ రావు ఏమీ మాట్లాడకుండానే ఫోన్ పెట్టేసినట్లు తెలుస్తోంది.అయితే, తొలుత ఎస్ఐబీ ఆధారాల ధ్వంసం కేసులో అరెస్టైన ప్రణీత్ రావును విచారిస్తుండగా.. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం వెలుగుచూడడంతో పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. రాష్ట్రంలో జరిగిన ఎన్నికలు, ఉప ఎన్నికల సమయంలో ప్రతిపక్ష పార్టీల ముఖ్య నేతలను లక్ష్యంగా చేసుకుని ట్యాపింగ్ లకు పాల్పడినట్లు గుర్తించారు. వ్యాపారులు, ప్రముఖుల ఫోన్లను సైతం ట్యాపింగ్ చేసినట్లు తెలుస్తోంది. ఎన్నికల ముందు వరకు భుజంగరావు పొలిటికల్ ఇంటెలిజెన్స్ విభాగంలో, తిరుపతన్న ఎస్ఐబీలో అదనపు ఎస్పీలుగా విధులు నిర్వర్తించారు.

## తొలిసారి గగనవీధుల్లో ఎగిరిన ఎల్సిఏ మార్క్ 1ఏ ఫైటర్ ఎయిర్క్రాఫ్ట్



**జయభేరి, బెంగుళూరు మార్చ్ 28:**

మేడిన్ ఇండియాలో భాగంగా నిర్మించిన లైట్ కంబాట్ ఎయిర్క్రాఫ్ట్ మార్క్ 1ఏ ఫైటర్ ఎయిర్క్రాఫ్ట్ ఇవాళ తొలిసారి గగనవీధుల్లో ఎగిరింది. మార్క్ 1ఏ ఫైటర్ విమానం పరీక్ష బెంగుళూరులో విజయవంతంగా ముగిసినట్లు హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ సంస్థ ప్రకటించింది. తన తొలి ఫ్లయిట్లో ఆ విమానం సుమారు 15 నిమిషాల పాటు గగనవీధిలో విహరించినట్లు హిందుస్తాన్ ఏరోనాటిక్స్ అధికారులు చెప్పారు. స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన మార్క్ 1ఏ ఫైటర్ విమానం భారతీయ చరిత్రలో కొత్త మైలురాయిని లిఖించింది. ఆ విమానం 1.15 నిమిషాలకు టేకాఫ్ తీసుకున్నది. 1.33 నిమిషాలకు అది ల్యాండ్ అయ్యింది. చీఫ్ టెస్ట్ పైలెట్ కేకే వేణుగోపాల్ ఆ ఫైటర్ విమానాన్ని నడిపారు.

---

నిజం.. అక్షర సత్యం.. కాలం వేగంగా తరలిపోతున్న రోజుల్లో మానవ జీవితం ఆర్థిక భారంతో ముడిపడి మానవ సంబంధాలు ఆర్థిక సంబంధాలుగా మారిపోయి మనుషుల్లా ప్రవర్తించకుండా యంత్రాలుగా ప్రవర్తిస్తూ అనుబంధాలు ఆప్యాయతలు ప్రేమలు మమతాను రాగాలు ఇలాంటి పదాలను పుస్తకాల్లోనే మడిచి దాచి పెట్టారు. ఈ నేపథ్యంలో 'జయభేరి' మానవ సంబంధాలను కాపాడుకోవాలనే ఉద్దేశంతో మీ కందిస్తున్న కౌంటర్ విత్ కడారి శ్రీనివాస్ సమగ్ర విశ్లేషణ... మనసుతో చదవండి.. పెదాలతో కాదు సుమా!?

# రూపాయి నీ రూపం ఏది!?

## మంటగలిసిపోతున్న మానవ సంబంధాలు..

## కరెన్సీ కట్టలకి ప్రాధాన్యతనిస్తున్న నేటి అనుబంధాలు ఆప్యాయతలు..!?



**జయభేరి, హైదరాబాద్ :**

తరం మారుతున్న కొద్దీ ఆలోచనలు మారుతున్నాయి. మనుషులు మారుతున్న కొద్ది అనుబంధాలు ఆప్యాయతలు కనుమరుగైపోతున్నాయి. కరెన్సీ కట్టలకు చిన్న పెద్ద ముసలి ముతక ఆడ మగ అధికారి అనధికారి ఇలాంటి పెద్ద పెద్ద హోదాలో ఉన్న వాళ్ళు సైతం కరెన్సీ మోజులో పడి అవినీతికి దాసోహమై బాధ్యతని మరిచిపోయే రోజుల్లో మనం ఇప్పుడు బతుకుతున్నాం. ఒక్కరన్న గుండె మీద చేయి వేసుకొని ఒక్కసారి ఆలోచించుకోండి.. ప్రతి రోజు ఏదో ఒక దినపత్రికలో పొదలో ఒక పసిపాప అనే వార్తను మనం నిత్యం చదువుతూనే ఉంటాం. అంటే ఆడపిల్ల అంటే భారంతో కూడుకున్నది. ఇది నాకొద్దు అని ముళ్ళపొదలో, చెట్లకుప్పల్లో పారేసే నీచ సంస్కృతికి శ్రీకారం చుడుతుంది ఈ నాగరిక సమాజం. ఆడపిల్లంటే దేవత లక్ష్మి మహాలక్ష్మి లు అని ఒక వైపు కీర్తిస్తూనే, ఇంకోవైపు చెట్ల పొదల్లో ముళ్ల కంపల్లో పసిపాప అని చూడకుండా పారేసే తల్లిదండ్రులను మనం చూస్తూనే ఉన్నాం. ఎందుకంటే ఆధునిక నాగరికతలో మనిషి మర యంత్రాలుగా మారిపోయి కాసులకే పట్టం కట్టే రోజుల్లో బంధాలు ఎక్కడ ఉంటాయి!?
ఒకప్పుడు ఉమ్మడి కుటుంబాల్లో అమ్మమ్మ తాతయ్య నాన్నమ్మ తాతయ్య మామ అత్త బాబాయి పెదనాన్న చిన్నమ్మ పెద్దమ్మ వదిన మరదళ్ళు ఇలా ఎన్నో సంబంధాలు అనుబంధాలు అల్లుకున్న పొదరిల్లు ఉమ్మడి కుటుంబాలుగా ఆ రోజుల్లో వెలసిల్లాయి. కానీ నేడు మనం బతుకుతున్న బతుకు ఏంటి!? పెళ్లి కాగానే వేరుబడి ప్రత్యేక కాపురం పెట్టి అమ్మానాన్నను చుట్టం చూపుగా చూసే సమాజంలో ఇప్పుడు మనం లేమా? ఇక అనుబంధాలు బంధాలు వీటి గురించి మాట్లాడితే అవి ఇప్పటీ తరానికి ముళ్ళ కంచెలు! ఈ బంధాలు బంధుత్వాలు ఇవన్నీ ట్రాష్ మనిషి ఒంటరిగానే పుట్టాడు ఒంటరిగానే పోతాడు. అయినా మనతో మనం సంపాదించుకున్న ఏ ఒక్క రూపాయి రాదు, ఎలా వచ్చామో అలానే వెళ్ళిపోతాం అనే వేద వాక్యాలను పటిస్తూనే మనిషి ఆశ చావకుండా దురాశతో కోట్ల డబ్బులను పోగేసుకొని బ్యాంకులను మనుషులను నమ్మిన వాళ్లను ఆఖరికి కన్న తల్లిదండ్రులను తోడబుట్టిన వాళ్లను సైతం మోసం చేసి కుటీల పన్నాగాలతో ఆస్తులు కూడగట్టుకొని అందరిని వదులుకోవడానికి కూడా సిద్ధపడుతున్నాడు. చదువుకున్న చదువు, చేస్తున్న ఉద్యోగం ఏమి సంబంధం ఉండదు. ఎందుకంటే నాకు కడుపు ఉందండి! నా భార్య పిల్లలు నా కుటుంబాన్ని ఎవరు చూసుకోవాలి. సమయం ఉన్నప్పుడే నాలుగు రాళ్లు వెనకేసుకోవాలి! అనే ఒక నీచ సంస్కృతికి శ్రీకారం చుడుతూ మనిషి తనను తానే మరిచిపోతున్నాడు. తాను కూర్చున్న చెట్టు కొమ్మని తానే నరుక్కుంటున్నాడు.

**మానవ సంబంధాలు ఆర్థిక సంబంధాలుగా మారిపోవడానికి అనేక కారణాలు ఉన్నప్పటికీ కనీసం మానవత్వం అనే ఒకటి మనిషిని నిత్యం రగిలించేస్తూనే ఉన్న ఇంకోవైపు మనిషి కఠినత్వాన్ని ప్రదర్శిస్తూ సమాజంలో ఏదో గొప్ప సేవ చేస్తున్నాను! అన్నట్టు ఒక్క మంచి పని చేసి మీడియాలో గొప్పలకు పోతూ, తన పేరును నలుగురికి తెలియజేయాలి అనే ఆలోచనతో కాస్తో కూస్తో ఖర్చు పెడుతున్న, దాని వెనక స్వార్థం కోరలు తెంచుకొని, కట్టలు దాటి ఏరులై పారుతుంది.**

ఇప్పుడు అన్ని చిన్న కుటుంబాలే. అమ్మానాన్న వారికి ఇద్దరు పిల్లలు అదే మా లోకం. అన్నట్టు నవీన ఆధునిక సమాజం విషపు కోరలను బహిర్గీతంగానే విరజిమ్ముతూ విశృంఖల నియంతృత్వాన్ని స్వార్థ భూతాన్ని నిలువునా కంఠంలో విషాన్ని దాచుకొని తెల్ల బట్టలు ధరించుకొని పెద్దమనుషుల పేరుతో చెలామనవుతున్నారు. ఇక రాజకీయం అంటే నాయకులంటే చెప్ప తరమే కాదు... నాయకులు తెల్ల బట్టలు ఎందుకేస్తారో తెలియని సమాజంలో ఇంకా మనం ఉన్నందుకు సిగ్గుపడాలి. శాంతి సహనానికి ప్రేమకి ప్రజలకు సేవ చేసే సేవా గుణాన్ని తెలియజేసే ఒక గుర్తుగా నాయకులు తెల్లబట్టలను ధరిస్తారు. కానీ దీనికి విరుద్ధంగా నేటి రాజకీయంలో రాజకీయ వ్యభిచారం చేస్తున్న వాళ్లు ఎంతో మందిని మనం నిత్యం చూస్తూనే ఉన్నాం. ఒకవైపు రాజకీయం ఇలా ఉంటే... ఇదే రాజకీయం ఇప్పుడు ప్రతి కుటుంబంలో అగ్ని రగిలిస్తూ ప్రతి వారు రాజకీయం గురించి సోషల్ మీడియాలో తనకిష్టం వచ్చినట్టు రాస్తూ, కొందరు రాక్షస ఆనందాన్ని పొందుతున్నారు. మరికొందరు ఇదే సోషల్ మీడియాని రాక్షసంగా వాడుకుంటూ అమ్మాయిలను నగ్నంగా ఫోటో తీస్తూ కొందరు కాసులు దండుకోవడానికి ప్రయత్నిస్తుంటే మరికొందరు దుర్మార్గులు అమ్మాయిల మానప్రాణాలను లోబరుచుకోవాలని దుర్మార్గపు ఆలోచనలతో విషాన్ని చిమ్ముతున్నారు. మానవ సంబంధాల్లో కరెన్సీ చేరి మనిషి జీవితాన్ని కకా వికలం చేస్తుంది. కన్న పిల్లలను కన్న తల్లిదండ్రులను విడగొడుతూ తోబుట్టువుల మధ్య తగాదాలు పెడుతూ కరెన్సీ కాలకూట నాగుల మారి విషాన్ని చిమ్ముతుంది. ఎంతోమంది తల్లిదండ్రులు పిల్లల ఆదరాభిమానాలను అందుకోలేక అనాథ శరణాలయాల్లో మగ్గుతున్నారు. దాన్ని చూసి మనందరం సిగ్గు లేకుండా తలవంచుకోవాల్సిందే. ఇంకోవైపు ఎంతో మంది పిల్లలు అనాథలుగా మిగిలి చౌరస్తాల్లో భిక్షాటన చేస్తూ కనిపిస్తున్నారు. ఆ పాపం నాది కాదులే అనుకొని నీవు నీ పనిలో ముందుకు సాగిన, ఈ సమాజం నిన్ను నన్ను దోషిని చేస్తూ ఆ పాపాన్ని పంచుకునేలా చేస్తుంది కాలం.. ఒకవైపు అనాథ శరణాలయాలు, ఇంకోవైపు ఆడపిల్ల అని తెలిసిన గర్భంలోనే మరణాలు, ఎక్కువగా సంభవిస్తున్నాయి.

**ఎవరో ఒక కవి అన్నట్టు రూపాయి రూపాయి నీ గుణం ఏంది అని అడిగితే.... అన్నదమ్ముల మధ్య చిచ్చు పెడతాను. భార్య భర్తల మధ్య దూరి ప్రేమను విడగొడతాను. అన్న చెల్లెల మధ్య బంధాన్ని దూరం చేస్తాను. అలాగే మనిషి మనిషికి మధ్య దూరం పెంచి కోపాన్ని పెంచుతాను... అంటూ గర్వంగా నాకు ఎన్నో రూపాలు ఉన్నాయి అవన్నీ మీరిచ్చినయే కదా అంటూ గర్వంగా తన విజయ సంకేతాన్ని చూపిస్తుందట రూపాయి... రూపాయి చేసే తప్పు అది మనం తప్పుగానే భావిస్తాం. కానీ రూపాయి చేసే ప్రతి పనిలో స్వచ్ఛమైన నిజాయితీ స్వార్థము కలిపి తన రూపాన్ని చూపిస్తుంది రూపాయి.**

కాలం మారుతున్న కొద్ది మనుషులు మారాలండి ఇంకా ప్రేమలు అనుబంధాలు బంధాలు ఆప్యాయతలు ఇవి ఎక్కడున్నాయి నేనైతే చూడలేదు గత కొన్నేళ్లుగా నా జీవితంలో ఎలాంటి మార్పు రాలేదు. అసలు ఒక్క మాటలో చెప్పాలి అంటే నా చిన్నతనం ఊహించుకుంటేనే చాలా కఠినంగా ఉంటుంది. భయమేస్తుంది. అని అనుకునే వారిలో నేను ఒకన్నే.... సమాజం కోసం యువత కోసం ఏదో చేయాలి ఏదో రాయాలి అనుకుంటూ అడుగులేసిన.. కానీ ఈ సమాజం నన్ను ఒక పిచ్చివానిగా మార్చేసింది. నన్ను ఒక పేదవాని గానే మిగిలిచ్చింది... కానీ అక్షరాన్ని నమ్ముకున్నాను కాబట్టే ఇలా మీ అందరితో మాట్లాడగలుగుతున్నాను..
కాస్తో కూస్తో ఈ వ్యాసం చదివి ఆలోచిస్తారు. మనిషిగా మారి ప్రవర్తిస్తారని ఆశిస్తున్నాను. మనమందరం మనుషులం జంతువులను కాదు.. కాలాలు మారిన తరాలు మారిన యుగాలు మారిన కాలం ఒడిలో మనమంతా పసిపాపలం. నోరులేని జీవాలు సైతం ప్రేమానురాగాలను చూపిస్తూ మనుషుల్ని ఆలోచింపజేస్తున్న మానవ యంత్రాలుగా జీవితాన్ని కొనసాగిస్తూ భాగ్య నగరాల్లో పట్టణాల్లో గ్రామీణ ప్రాంతాల్లో పూర్తిగా మానవత్వాన్ని మరిచిపోయి భవ బంధాలను విడిచి కన్న ప్రేమలను వదులుకొని కన్నవారిని లెక్కచేయకుండా తిరిగే ఓ నా సమాజమా ఇకనైనా ఒక్కసారి ఆలోచించు నీ ప్రవర్తనను మార్చుకుంటావ్ అనుకుంటూ.... మనలోని మనీ అన్న మాటను కాస్త దూరం పెట్టి మానవత్వాన్ని ముందు నడిపించి, నేను మనిషిని నాలోను మానవత్వం ఉంది అని ఒక్కసారి కలిసి ఆచరణాత్మకంగా మన బాధ్యతలను నిర్వర్తించుదాం... సర్వేజనా సుఖినోభవంతు.. సర్వేజనా సుజనో భవంతు... అన్న సూక్తిని మరొక మారు రుజువు చేద్దాం...



కడారి శ్రీనివాస్
కాలమిస్ట్, సీనియర్ జర్నలిస్ట్, కవి, రచయిత
గాయకులు, సామాజిక ఉద్యమకారులు

---

# ఓటరుగా నమోదైన వారందరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి

- అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలి
- జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రోస్

**జయభేరి, హైదరాబాద్:**

ప్రతి ఓటరు తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, జిహెచ్ఎంసి కమిషనర్ రోనాల్డ్ రోస్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో స్వీప్ కార్యక్రమంలో భాగంగా గురువారం జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయం పన్వర్ హాల్ లో టిఎల్ఎఫ్, ఎస్.ఎల్.ఎఫ్ లీడర్స్, సీనియర్ సిటిజన్స్, దివ్యాంగుల అసోసియేషన్ ప్రతినిధులు, థర్డ్ జెండర్, ట్రాన్స్ జెండర్స్ ప్రతినిధులు, స్వయం సహాయక సంఘాల మహిళా ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రోస్ మాట్లాడుతూ... ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం లాంటిదని, ఓటు వేయడం బాధ్యతగా భావించాలన్నారు. ఇప్పటికే ఓటు హక్కు పొందిన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. 18 సం.లు నిండిన వారందరూ ఓటరుగా నమోదు కావాలన్నారు. ఓటరుగా నమోదు కాని వారు ఏప్రిల్, 15 వరకు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఓటరు జాబితాలో తమ పేరు ఉన్నదీ, లేనిదీ చూసుకోవాలని సూచించారు. ఆయా సంఘాల ప్రతినిధులు ఓటింగ్ శాతం పెంచడం పై కృషి చేయాలని రోనాల్డ్ రోస్ కోరారు. కళాశాల విద్యార్థులకు తమ ఓటు హక్కును వినియోగించుకునేలా ఓటు హక్కు ప్రాధాన్యత, ఆవశ్యకతపై అవగాహన కల్పించాలన్నారు. ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు ఓటు హక్కు వినియోగించుకునేలా విస్తృత ప్రచారం చేయాలన్నారు. రెసిడెన్షియల్ అసోసియేషన్ వారితో సమావేశాలు నిర్వహించి ఓటింగ్ శాతం పెరిగేలా చూడాలన్నారు. స్వయం సహాయక సంఘాలు, విద్యార్థుల ద్వారా వారి కుటుంబంలో ఓటు వేయడం పై అవగాహన కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా స్వీప్ నోడల్ అధికారి, ఆయా అధికారులు ఎన్నికల్లో సీనియర్ సిటిజన్స్ కు, దివ్యాంగ ఓటర్లకు కల్పిస్తున్న సౌకర్యాల పై వివరించారు. వారికి సంబంధించి అన్ని పోలింగ్ కేంద్రాలు గ్రౌండ్ ఫ్లోర్ లో ఉండేలా చర్యలు చేపట్టాలని, ర్యాంప్ సదుపాయం, కనీస మౌలిక సదుపాయాలు ఉండేలా చూడాలని, వీరికి సపరేట్ క్యూ లైన్/ప్రాధాన్యతనిచ్చి



ఎలాంటి ఇబ్బంది కలగకుండా నేరుగా తీసుకెళ్ళి ఓటు వేయించాలని, ప్రతి లొకేషన్ లో సరిపడినన్ని వీల్ చైర్స్ అందుబాటులో ఉంచాలని తెలిపారు. 18 సంవత్సరాలు నిండి ఇంకా ఓటర్ జాబితాలో మార్కింగ్ చేయని దివ్యాంగులందరినీ మార్కింగ్ చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. 85 సంవత్సరాలు పైబడిన వయో వృద్ధులు, పిడబ్ల్యుడి ఓటర్లు ఫారం 12డి కింద దరఖాస్తు చేసుకుంటే ఇంటి నుండి ఓటు వేసే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ యు.సి.డి చంద్రకాంత్ రెడ్డి, స్వీప్ నోడల్ అధికారి అరుణ కుమారి, జాయింట్ కమిషనర్ పి.డబ్ల్యు.డి నోడల్ అధికారి వెంకట్ రెడ్డి, ప్రాజెక్ట్ ఆఫీసర్ సౌజన్య, ఎన్నికల వ్యయ పరిశీలకులు శరత్ చంద్ర, అసిస్టెంట్ స్వీప్ నోడల్ అధికారులు, ఎస్ ఎల్ ఎఫ్ లీడర్స్, టిఎల్ఎఫ్ లీడర్స్, ఎస్.హెచ్.జి ప్రతినిధులు, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్, దివ్యాంగుల అసోసియేషన్, ట్రాన్స్ జెండర్, థర్డ్ జెండర్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# అవిశ్వాసమా..? రాజీనామా..?

- కామారెడ్డి మున్సిపాలిటీ రాజకీయం రసవత్తరంగా మారుతుంది
- ఎటు తేల్చుకోలేని స్థితిలో మున్సిపల్ చైర్మన్
- అవిశ్వాసం తెలియకుండా రంగంలోకి కేటీఆర్
- కాంగ్రెస్ కు మద్దతిచ్చే బిఆర్ఎస్ కౌన్సిలర్లకు విప్ జారీ అయ్యేనా..?
- 30న అవిశ్వాసం.....గోవా టూర్ లో కౌన్సిలర్లు
- ఉత్కంఠంగా కామారెడ్డి మున్సిపల్ రాజకీయం

**జయభేరి, కామారెడ్డి జిల్లా బ్యూరో :**

కామారెడ్డి మున్సిపాలిటీ రాజకీయం రసవత్తరంగా మారుతుంది.రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాలిటీలను మన ఖాతాలో వేసుకుంటున్న కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి మున్సిపాలిటీని కూడా తన ఖాతాలో వేసుకునేందుకు సిద్ధమైంది.దానికోసం మున్సిపాలిటీలో 4 ఉన్న తమ బలాన్ని 27 కు పెంచుకుంది. 27 మంది కౌన్సిలర్లతో చైర్మన్ పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు కలెక్టర్ కు కౌన్సిలర్లు తీర్మానం అందజేయగా ఈనెల 30న అవిశ్వాసానికి తేదీ నిర్ణయించారు.ఇప్పటికీ 27 మంది కౌన్సిలర్లతో పాటు తమకు మద్దతుగా నిలిచే మరో ఏడుగురు కౌన్సిలర్లను గోవా క్యాంపుకు తరలించింది.ఈనెల 30న క్యాంపునకు వెళ్లిన కౌన్సిలర్లు నేరుగా మున్సిపల్ కార్యాలయానికి రానున్నారు రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది.

**కౌన్సిలర్లకు జారి అవకాశం ఉందా....?**

కామారెడ్డి మున్సిపల్ ఎన్నికల అనంతరం కాంగ్రెస్, స్వతంత్ర అభ్యర్థులు బిఆర్ఎస్ తీర్థం పుచ్చుకోవడంతో ఉన్న బిఆర్ఎస్ బలం ప్రస్తుతం 16కు చేరినట్టుగా తెలుస్తుంది. మిగతా వారిలో ఆరుగురు బిజెపి,27 మంది కాంగ్రెస్ కౌన్సిలర్ ఉన్నారు.మున్సిపల్ ఎన్నికల్లో 12 మంది కాంగ్రెస్ పార్టీ తరఫున గెలిచిన కౌన్సిలర్లలో విడతల వారిగా ఎన్ని 8 బిఆర్ఎస్ తీర్థం పుచ్చుకోగా ప్రస్తుతం ఘర్ వాపసిలో భాగంగా వెనక్కి వచ్చారు. వారితోపాటు మరికొంత మందినీ తీసుకురావడం బిఆర్ఎస్ కు మైనస్ గా మారింది.

**గోవా క్యాంపులో కౌన్సిలర్లు**

చైర్మన్ పై అవిశ్వాసం లేఖ కలెక్టర్ కు అందేసిన రోజే 27 మంది కౌన్సిలర్లు ప్రత్యేక బస్సులు క్యాంపుకు తరలి వెళ్లారు.కొద్ది రోజులపాటు హైదరాబాద్లోని హోటల్లో ఉన్న కౌన్సిలర్లు తాజాగా చైర్మన్ కు వ్యతిరేకంగా ఉన్న బిఆర్ఎస్ కౌన్సిలర్లు కాంగ్రెస్ కు మద్దతు తెలుపడంతో వారితో పాటు 27 మంది కౌన్సిలర్ అంతా గోవా టూర్ కు బయలుదేరారు.30న అవిశ్వాసం రోజేనే వారు తిరిగి కామారెడ్డి రానున్నారు.

**రంగంలోకి కేటీఆర్**

అవిశ్వాసానికి గడువు సమీపిస్తుండడంతో మున్సిపాలిటీ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది.ఈ క్రమంలో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రంగంలోకి దిగినట్టుగా ప్రచారం సాగుతుంది.చైర్మన్ కు వ్యతిరేకంగా కాంగ్రెస్ కు మద్దతు ఇవ్వడానికి సిద్ధమైన బిఆర్ఎస్ కౌన్సిలర్ తో కేటీఆర్ మాట్లాడారని,అవిశ్వాసానికి మద్దతు ఇవ్వకుండా ఉండాలని సూచించినట్టుగా తెలుస్తుంది. దాంతో ఆలోచనలో పడ్డ బిఆర్ఎస్ కౌన్సిలర్ అవిశ్వాస మద్దతుపై పునరాలోచన చేస్తున్నట్టుగా తెలుస్తుంది.

**అయోమయంలో చైర్మన్ కుటుంబం**

మరోవైపు ఇంతకాలం బిఆర్ఎస్ లో కొనసాగి చైర్మన్ కు మద్దతుగా నిలిచిన కౌన్సిలర్లు ఒక్కసారిగా చేజారిపోవడంతో చైర్మన్ కుటుంబం అయోమయంలో పడింది. తమకు నమ్మిన వ్యక్తులుగా ఉన్న వాళ్ళు సైతం దొడ్డి జారిన కాంగ్రెస్కు మద్దతు పలకడంతో అవిశ్వాసం గడ్డం నుంచి బయటపడే మార్గాలను చైర్మన్ అన్వేషిస్తున్నారు.ఇటీవల జిల్లా కేంద్రంలోని సత్య గార్డెన్ లో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటిఆర్ ఆధ్వర్యంలో కార్యకర్తల సమావేశం జరిగిన చైర్మన్ నీట్టు జాహ్నవి మినహా ఆయన తండ్రి నీట్టు వేణుగోపాల్ రావు,బాబాయ్ నీట్టు కృష్ణమోహన్రావు డుమ్మా కొట్టారు. దాంతో నీట్టు కుటుంబం పార్టీ మాడం పక్క అనే ప్రచారం సాగింది.పార్టీ మారడం కన్నా రాజీనామా చేయడమే శ్రేయస్కరమని నిట్టు కుటుంబం ఒక నిర్ణయానికి వచ్చినట్టుగా తెలుస్తుంది.కేటిఆర్ మంత్రంగం పనిచేయకపోతే రేపో మాపో రాజీనామా చేసి మీడియం ముందుకు వచ్చే అవకాశాలు ఉన్నయన్నట్టుగా ప్రచారం సాగుతుంది. రాజీనామా చేస్తే హుందాక పదవి నుంచి తప్పుకున్నట్టుగా ఉంటుందని, అలాగే అవిశ్వాసం ఉండడం ద్వారా పదవి పోయిందన్న అపవాదు కూడా ఉండదన్న ఆలోచనలో నిట్టు కుటుంబం ఉన్నట్టుగా తెలుస్తుంది.దాంతో 30న జరగబోయే అవిశ్వాసం నెక్కుతుందా వీగిపోతుందా అనేది తీయాల్సిందే.








# వన్ కార్డ్ బిజినెస్ సొల్యూషన్ ఆధ్వర్యంలో మెగా హెల్త్ క్యాంప్

**జయభేరి, కామారెడ్డి జిల్లా బ్యూరో, మార్చ్ 28 :**

కామారెడ్డి జిల్లా కేంద్రంలోని సాందీపని డిగ్రీ కళాశాలలో గురువారం వన్ కార్డ్ బిజినెస్ సొల్యూషన్ ఆధ్వర్యంలో స్పర్శ స్కిన్ హాస్పిటల్, నిమ్మస్ డెంటల్,అఖిల హాస్పిటల్ వారి సహకారంతో మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించినట్లు సాందీపని విద్యాసంస్థల డైరెక్టర్ హరిస్మరన్ రెడ్డి,అకాడమిక్ ప్రిన్సిపల్ మనోజ్ కుమార్ లు తెలిపారు. పేర్కొన్నారు.ఈ సందర్భంగా సుమారు 300 మంది పైగా విద్యార్థులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి మెడిసిన్ అందజేయడం జరిగిందని వారూ పేర్కొన్నారు.అలాగే ఉచితంగా డిస్కౌంట్ కార్డు లు కలశాల విద్యార్థులకు అందజేయడం పట్ల కళాశాల యాజమాన్యం వన్ కార్డ్ సిబ్బందిని అభినందించారు.అనంతరం వన్ కార్డు సిబ్బంది మాట్లాడుతూ కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా 20వేల కార్డులు ఉచితంగా అందజేయడం జరుగుతుందని ఈ కార్డు వల్ల పలు హాస్పిటల్ లో మూడు నెలల వరకు ఉచిత ఓపి కన్సల్టేషన్ తోపాటు మెడికల్ ల్యాబ్ లో 30% వరకు డిస్కౌంట్ లభిస్తాయని ఇతర వ్యాపార సముదాయాలు ప్రత్యేక డిస్కౌంట్లు లభించడం జరుగుతుందని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో డాక్టర్లు సందీప్ కుమార్ రవిలాల, పుట్ట మల్లికార్జున్, పుట్ట భవాని, అభిషేక్ రెడ్డి, వన్ కార్డు ప్రతినిధులు రవి, కిషోర్, రమ్య, శ్రావణి, కళాశాల స్టాప్ ప్రభాకర్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# రక్తదానానికి విద్యార్థులు ముందుకు రావడం అభినందనీయం...

- విద్యార్థి దశ నుండే సేవా భావనను పెంపొందించుకోవాలి...
- ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్,రెడ్ క్రాస్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ బాలు...



**జయభేరి, కామారెడ్డి జిల్లా బ్యూరో, మార్చ్ 28 :**

కామారెడ్డి జిల్లా కేంద్రంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాల (బాలుర) లో ఈ రోజు ఇంటర్నేషనల్ వైశ్ ఫెడరేషన్ (ఐవిఎఫ్),ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ,కామారెడ్డి రక్తదాతల సమూహం ఆధ్వర్యంలో జాతీయ సేవా పథకం ఎన్ఎస్ఎస్ విద్యార్థుల సహకారంతో రక్తదాన శిబిరాన్ని నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్,రెడ్ క్రాస్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ బాలు,కామారెడ్డి రక్తదాతల సమూహ అధ్యక్షుడు డాక్టర్ వేదప్రకాష్ లు మాట్లాడుతూ విద్యార్థులు రక్తదానానికి ముందుకు రావడం అభినందనీయమని విద్యార్థి దశ నుండి సేవా భావనను పెంపొందించు కోవాలన్నారు.కామారెడ్డి ప్రభుత్వ వైద్యశాలలో రక్త నిల్వలు లేకపోవడం వల్ల వివిధ ప్రాంతాల నుండి వచ్చే గర్భిణీ స్త్రీలు తీవ్రమైన ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని వారి కోసమే ఈ శిబిరాన్ని నిర్వహించడం జరిగిందన్నారు.ఈ రక్తదాన శిబిరానికి సహకరించిన ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ మండల రామలక్ష్మిని సన్మానించడం జరిగింది.ఈ రక్తదాన శిబిరంలో భాగంగా 27 యూనిట్ల రక్తాన్ని సేకరించడం జరిగింది.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అన్నపూర్ణ,నవీన్,కామారెడ్డి రక్తదాతల సమూహ ఉపాధ్యక్షుడు కిరణ్,కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి,టెక్నీషియన్లు అమర్ నాథ్,అరుణ్,నవీన్,పోశెట్టి లు పాల్గొనడం జరిగింది.

# ఈ సమస్యలను తప్పక నెరవేరుస్తామని ఎమ్మెల్యే హామీ



**జయభేరి, కాప్రా :**

చర్లపల్లి డివిజన్ కాలనీ సమస్యలపై విస్తృత పర్యటన చేసిన ఎమ్మెల్యే బండారి లక్ష్మా రెడ్డి. చర్లపల్లి డివిజన్ చక్రిపురం, టీచర్స్ కాలనీ, సీతారాం కాలనీ, మారుతి కాలనీ, గాంధీ నగర్, సోనియా గాంధీ నగర్ ఫేస్ 2 కాలనీ లలో ఎమ్మేల్యే బండారి లక్ష్మారెడ్డి, కాలనీ వాసులు, ప్రెసిడెంట్లతో కలిసి పర్యటించారు. స్థానిక సమస్యలను కాలనీ వాసులను అడిగి తెలుసుకున్నారు. కాలనీలో కొన్ని చోట్ల డ్రైనేజీలు సమస్య, ప్రధానంగా మంచినీటి పైప్ లైన్ సమస్యలను గుర్తించి, అలాగే సీసీ రోడ్ ఎర్పాటు చేయలని కాలనీ వాసులు కొరగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కార మార్గాన్ని చూపుతామని నియోజకవర్గ పరిధిలోని ప్రతి సమస్యకు శాశ్వత పరిష్కారమందిస్తామని సంబందిత అధికారులతో మాట్లాడి ఈ సమస్యలను తప్పక నెరవేరుస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకుడు మహేష్ గౌడ్, డివిజన్ అధ్యక్షులు డప్పు గిరిబాబు, చక్రిపురం కాలనీ ప్రెసిడెంట్ రాఘవ రెడ్డి, బుచ్చిరెడ్డి, టీచర్స్ కాలనీ ప్రెసిడెంట్ మహిపాల్ రెడ్డి, సీతారామ్ కాలనీ ప్రెసిడెంట్ ఆశోక్ ముదిరాజ్, గాంధీ నగర్ కాలనీ ప్రెసిడెంట్ శ్రీశైలం, మారుతి నగర్ కాలనీ ప్రెసిడెంట్ శ్రీనివాస్ నాయక్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.







# జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అవగాహన సదస్సు

- షీ టీమ్ ఎస్సై స్రవంతి

**జయభేరి, కామారెడ్డి జిల్లా బ్యూరో, మార్చి 28 :**

కామారెడ్డి జిల్లాలోని రామారెడ్డి పోలీస్ స్టేషన్ పరిధిలో రెడ్డి పేట గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం షీ టీమ్,సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా కళాబృందం సభ్యులు షీ టీమ్ సభ్యులు,షీటీం నెంబర్ 8712686094 గురించి,సైబర్ నేరాల పట్ల టోల్ ఫ్రీ నెంబర్ 1930 గురించి భాదితులపై నెంబర్ కు ఫిర్యాదులు చేసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎస్సై స్రవంతి, కళాబృందం సభ్యులు, షీ టీం బృందం పాల్గొన్నారు.

# అప్పుల బాధతో ఇంట్లోనుండి వెల్లినపోయిన యువకుడు




**జయభేరి, కామారెడ్డి జిల్లా బ్యూరో, మార్చి 28 :**

కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లి గ్రామానికి చెందిన దేవల సంజయ్, వయసు 28 సంలు,అనే యువకుడు తన ఇంటి నుండి పని ఉందని భార్యతో చెప్పి,కామారెడ్డి వెళ్తున్నానని తన భార్య అయిన శ్రీలతకు చెప్పి ఇంట్లో ఉంది వెళ్ళిపోయాడు తిరిగి సాయంత్రం అయినా కూడా ఇంటికి రాకపోయేసరికి,అతని భార్య శ్రీలత ఫోన్ చేయగా ఫోన్ ఇంట్లోనే పెట్టి వెళ్లినాడని గుర్తించింది. అయితే గత కొద్ది కాలం నుండి ఇల్లు కట్టడానికి చేసిన అప్పులు తీర్చే విషయంలో బాధపడుతున్నట్లుగా తెలిపారు.అతని భార్య ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు కామారెడ్డి ఎస్.హెచ్.ఓ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు.

# వృద్ధుడు అదృశ్యం

**జయభేరి, కామారెడ్డి జిల్లా బ్యూరో, మార్చి 28 :**



కామారెడ్డి మండలంలోని లింగాయపల్లి గ్రామానికి చెందిన తొట్టు భూమయ్య తండ్రి రామయ్య (70), తేదీ 11.03.2024 నుండి ఇంట్లో నుండి బయటకి వెళ్లి ఇంటికి రాలేదు. కూతురు జాటపు మమత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు దేవునిపల్లి ఎస్సై రాజు తెలిపారు. ఈ వ్యక్తి ఆచూకీ తెలిస్తే ఈ క్రింది నంబర్లకు కామారెడ్డి రూల్ సిఐ 8712686148,దేవునిపల్లి ఎస్సై 8712686150 తెలియజేయగలరు.

# గుండ్లపోచంపల్లిలో బిఆర్ఎస్ కు షాక్

- కమలం గూటికి బిఆర్ఎస్ కౌన్సిలర్లు..
- కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన ఈటల రాజేందర్..

**జయభేరి, మేడ్చల్ :**



రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ కనుమరుగు కానుందని మల్కాజిగిరి పార్లమెంట్ బిజెపి ఎంపి అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. గురువారం మేడ్చల్ జిల్లా గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీకి చెందిన ఇద్దరు బిఆర్ఎస్ కౌన్సిలర్లు దాదాపు 100 మంది అనుచరులతో కలిసి మున్సిపల్ అధ్యక్షుడు ఉషిగారి శ్రీనివాస్ ఆధ్వర్యంలో మాజీ మంత్రి ఈటల రాజేందర్ సమక్షంలో బిజెపి లో చేరారు. వారిని ఈటల పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ ప్రపంచలోనే అతి శక్తివంతమైన నాయకుడు ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. అభివృద్ధి చెందిన దేశాలన్నీ భారత్ వైపు చూస్తున్నాయన్నారు. పదేళ్లలో దేశంలో అవినీతి రహిత పాలన అందిస్తూ బీజేపీ ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో దేశంలో 400 ఎంపీ సీట్లు బీజేపీ టార్గెట్ అని అన్నారు. తెలంగాణలో 17 ఎంపీ సీట్లు గెలిచే విధంగా ప్రతీ కార్యకర్త పార్టీ అభ్యర్థుల గెలుపుకోసం కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు విక్రమ్ రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ అమరం మోహన్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, కౌన్సిలర్ అమరం సరస్వతి, కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు కృష్ణ గౌడ్, మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు కిషన్, అశోక్, శ్రీధర్, కృష్ణా, చింత నర్సింగ్, రాజు, పిడుగుల నాగరాజు, చెంచాల సురేష్, మల్లేష్, యాదగిరి, ఆంజనేయులు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరి కళలను సకారం చేసే మార్గంలో ప్రయాణం చేస్తుంది


- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**జయభేరి, ఉప్పల్ :**



జూబ్లీ హిల్స్ లో మెల్బోర్న్ మామ క్రియేటివ్ స్పేస్ ప్రారంభం. ముఖ్య అతిథిగా హాజరైన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఈఓ సతీష్ వర్మ మెల్బోర్న్ మామ స్థాపించి సృజనాత్మక రంగంలో మరోక కొత్త మలుపుని తీసుకోస్తున్నారు అని ఆయన అన్నారు. తనదైన శైలితో, సృజనాత్మకతను ఇంకోక మెట్టు ఎక్కిస్తు, కొత్తదనాన్ని పరిచయం చెయ్యాలన్న దృక్పదంతో సీఈఓ సతీష్ వర్మ న్యాయకత్వంలో మెల్బోర్న్ మామ క్రియేటివ్ స్పేస్ ఆఫీస్ హైదరాబాద్ లో ఘనంగా ప్రారంభం ఐనది అని ఇది ఇండో ఆస్ట్రేలియన్ చరిత్రలో మరోక మైలు రాయిగా చెప్పుకోవచ్చు . మొట్టమొదట 2017లో, మెల్బోర్న్ లో చదువుతున్న భారతీయ విద్యార్థులకు చేయుతనివ్వటానికి ప్రారంభించబడింది. క్రమక్రమంగా పరిచయాలు పెంచుకుంటూ, కలిసికట్టుగా పనిచేస్తూ, సృజనాత్మకతను ప్రదర్శిస్తూ, "మేము" అనే పద్ధతిలో కాకుండా "మనము" అనే తీరులో అందరితో కలుపుగోలుగా పైకి ఎదుగుతూ వచ్చింది. ముఖ్యంగా రకరకాల రంగాల నుంచి వచ్చే కళాకారులకు, రచయితలకు, వ్యవస్థాపకులకు, వారి విజయానికి తోడుపడటానికి మెల్బోర్న్ మామ ప్రారంభించారు. కలిసికట్టుగా కృషి చేసి, అందరికీ చేయూతనిస్తూ ఒక మిలియన్ డాలర్ సంస్థల దిశలోఎదగాలనేలక్ష్యంతో ముందుకు వెళ్తుంది, ప్రతి ఒక్కరి కళలను సకారం చేసే మార్గంలో ప్రయాణం చేస్తుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో బోసాని పవన్ స్కయ్ ఆనంద్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.





# రామరెడ్డి పోలీస్ స్టేషన్లో కత్తితో సైకో వీరంగం

▸ అర్ధరాత్రి కత్తితో సైకో వీరంగం

✍ **జయభేరి, కామారెడ్డి జిల్లా బ్యూరో, మార్చ్ 28 :**

కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి నియోజకవర్గం మద్యం మత్తులో ఓ సైకో రామారెడ్డి పోలీస్ స్టేషన్ లో విరంగం సృష్టించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బుధవారం అర్ధరాత్రి సమయంలో స్టేషన్కు వచ్చి పోలీసులపై కక్కుతూ దాడిని పాల్పడ్డాడు.అలాగే ఫర్నిచర్ సైతం దర్శనం చేశాడు.రామారెడ్డి కి చెందిన రవి అనే యువకుడు మద్యం మత్తులో బుధవారం రాత్రి తల్లిదండ్రులతో గొడవపడి పోలీస్ స్టేషన్కు వచ్చాడు.రవి ని సముదాయిస్తున్న సమయంలో స్టేషన్ లో ఉన్న కానిస్టేబుల్ సిద్ధిరాములు పై కత్తితో దాడి చేశాడు.గాయపడ్డ సిబ్బందిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. గతంలోనూ సదర్ యువకుడు పలుమార్లు పోలీస్ స్టేషన్ లో వీరంగం సృష్టించినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు.ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.




# పెళ్లి వాహనం బోల్తా.. పలువురికి గాయాలు

▸ పెళ్లి వాహనం బోల్తా పడి 12 మందికి గాయాలు



✍ **జయభేరి, కామారెడ్డి జిల్లా బ్యూరో, మార్చ్ 28 :**

ఎల్లారెడ్డి నియోజకవర్గం లింగంపేట మండలం లింగంపల్లి కుర్దు గ్రామ సమీపంలో గురువారం పెళ్లి వాహనం బోల్తాపడి 12 మందికి గాయాలు అయ్యాయి.స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం లింగంపల్లి కి చెందిన కొత్త కిషన్ కుమార్ రెడ్డి వివాహం గ్రామ సమీపంలోని జిఎన్ఆర్ గార్డెన్ లో నిర్వహిస్తున్నారు.వివాహ వేడుకకు గ్రామం నుంచి బంధువులను టాటాఎస్ వాహనంలో తరలిస్తుండగా ప్రమాదవశాత్తు ఫంక్షన్ హాల్ సమీపంలో బోల్తా పడింది.ప్రమాదంలో 12 మందికి గాయాలయ్యాయి.క్షతగాత్రులను 108 వాహనంలో కామారెడ్డి ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఘటన స్థలానికి ఎస్సై చైతన్య కుమార్ రెడ్డి చేరుకొని ట్రాఫిక్ కు అంతరాయం కాకుండా చర్యలు చేపట్టారు.

# పాఠశాల విద్యార్థులకు ఉచిత పరీక్ష ప్యాడ్స్, నోట్ బుక్స్ పంపిణీ



✍ **జయభేరి, దేవరకొండ :**

లయన్స్ క్లబ్ అఫ్ దేవరకొండ మిత్ర సారధ్యములో లయన్ పీఎంజేఎఫ్ లయన్ కేవీ ప్రసాద్ డీసీ నల్గొండ సహకారంతో లయన్స్ క్లబ్ అఫ్ దేవరకొండ మిత్ర అధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారి లయన్ అంకం చంద్రమౌళి, లయన్ కూరెళ్ల కృష్ణాచారి, మాకం మహేష్ సారధ్యములో పట్టణంలోని సంజయ్ కాలనీ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఉచిత పరీక్ష ప్యాడ్స్, నోట్ బుక్స్ పంపిణీ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సంజయ్ కాలనీ కౌన్సిలర్ శ్రీవాణి ప్రదీప్, ప్రధానోపాధ్యాయులు అంకూరి రాములు పాల్గొన్నారు.కౌన్సిలర్, ప్రధానోపాధ్యాయులు చిత్రం శ్రీవాణి ప్రదీప్, రాములు మాట్లాడుతూ లయన్స్ క్లబ్ అఫ్ దేవరకొండ మిత్ర కార్యవర్గం,మా గురువు లయన్ అంకం చంద్రమౌళి మా పాఠశాల ను ఎన్నుకోవడం చాలా సంతోషకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అఫ్ మిత్ర సభ్యులు లయన్ చిలుకూరి వెంకటేశ్వర్లు, లయన్ వెంకటేశ్వర్లు,సహా ఉపాధ్యాయులు పావని స్థానికులు పాలుగోన్నారు.

# వరి ధాన్యం కొనుగోళ్లు సజావుగా నిర్వహించాలి

▸ జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్

✍ **జయభేరి, కామారెడ్డి జిల్లా బ్యూరో :**

కామారెడ్డి జిల్లాలో వరి ధాన్యం కొనుగోళ్లు సజావుగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్ అధికారులను ఆదేశించారు.రబీ సీజన్ (202324) ధాన్యం కొనుగోళ్లపై జిల్లాలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు,వివిధ శాఖల అధికారులతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం లోని సమావేశం మందిరంలో అదనపు కలెక్టర్ చంద్రమోహన్ గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ,లోక్ సభ ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తన నియమావళిని అనుసరిస్తూ కొనుగోలు కేంద్రాలను అధికారులు,ఆయా శాఖల బాధ్యులు మాత్రమే ప్రారంభించాలని స్పష్టం చేశారు.ఎక్కడ ప్రజాప్రతినిధులను ఆహ్వానించరాదని సూచించారు.



కొనుగోలు కేంద్రాల్లో తప్పనిసరిగా టెంట్లు,తాగు నీరు,విద్యుత్ వసతి కల్పించాలని,టార్పాలిన్లు,ప్యాడీ క్లీనర్లు,తూకం వేసే యంత్రాలు అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు.ధాన్యం తూకంలో పారదర్శకంగా ఉండాలని,నిర్దేశించిన విధంగా కొనుగోళ్లు చేయాలని సూచించారు.నిర్దేశించిన బరువుకంటే ఎక్కువ ఎట్టి పరిస్థితుల్లోనూ చేయవద్దని ఆయన స్పష్టం చేశారు.

**మద్దతు ధరకే విక్రయించాలి**

రైతులు తాము కష్టపడి పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని అదనపు కలెక్టర్ చంద్రమోహన్ పిలుపునిచ్చారు.రైతులు తమ ధాన్యాన్ని తాలు, తప్ప లేకుండా,తేమ శాతం 17 ఉండేలా చూసుకుని,నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూకేంద్రాలకు తరలించాలని సూచించారు.ప్రభుత్వం గ్రేడ్ ఏ రకం ధాన్యానికి క్వింటాలుకు రూ.2203,గ్రేడ్ బీ రకానికి రూ.2183 నిర్ణయించినందని వెల్లడించారు.నిబంధనల మేరకు రైతులు తమ ధాన్యాన్ని శుభ్రంగా తీసుకువచ్చి,మద్దతు ధర పొందాలని సూచించారు.




**ఏప్రిల్ 1 నుంచి ప్రారంభం**

రబీ సీజన్ కోతలు మొదలైన దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని మండలాల్లో ఏప్రిల్ 1 వ తేదీ లోగా ఒక్కో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించనున్నట్లు అదనపు కలెక్టర్ తెలిపారు.వ్యవసాయ శాఖ అంచనాల ప్రకారం జిల్లా లో ఈ రబీ సీజన్లో దాదాపు 4.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రానుందని వెల్లడించారు.ధాన్యాన్ని సేకరించేందుకు పీఏసీఎస్ ఆధ్వర్యంలో 326, ఐకేపీ ఆధ్వర్యంలో 22 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించనున్నట్లు వివరించారు.ఏప్రిల్ 15వ తేదీ వరకు అన్ని కేంద్రాలు ప్రారంభించనున్నట్లు తెలిపారు. అవసరం అయితే ఇంకా కేంద్రాలు ఎక్కువ ప్రారంభిస్తామని పేర్కొన్నారు.రైతులకు టోకెన్లు ఇవ్వాలని, దాని ప్రకారం కొనుగోళ్లు చేయాలని సూచించారు. ఈ సారి ఐరిస్ యంత్రాలు కూడా పంపిస్తామని, ధాన్యం కొనుగోలు చేసినప్పుడు రైతు ఐరిస్ కూడా తీసుకోవాలని సూచించారు.

ఆయా కొనుగోలు కేంద్రాలకు కేటాయించిన రైస్ మిల్లులకు ధాన్యాన్ని తరలించాలని,రైతులకు ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా శాఖల అధికారులు కొనుగోళ్లు నిత్యం పర్యవేక్షించాలని ఆదేశించారు.

**అందుబాటులో పరికరాలు**

జిల్లాలో అవసరం మేరకు అన్ని పరికరాలు సిద్ధం చేసుకోవాలని అదనపు కలెక్టర్ వెల్లడించారు.టార్పాలిన్లు,తూకం వేసే యంత్రాలు,ప్యాడీ క్లీనర్లు,తేమ శాతం చూసే మెషిన్లు అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు.జిల్లాలోని రైతులు వీటిని సద్వినియోగం చేసుకొని ప్రభుత్వ మద్దతు ధరకే ధాన్యాన్ని విక్రయించాలని అదనపు కలెక్టర్ సూచించారు.నాణ్యమైన ధాన్యాన్ని చివరి గింజ వరకు కొనుగోలు చేయాలని చెప్పారు.ఈ సమీక్షలో డీసీఎస్ఓ మల్లికార్జున బాబు,జిల్లా మేనేజర్ నిత్యానంద్,జిల్లా సహకార అధికారి శ్రీనివాసరావు,జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి,ఐకెపి డిపిఎం రమేష్ బాబు,జిల్లా రైస్ మిల్ అసోసియేషన్ అధ్యక్షుడు కంచర్ల లింగం,వ్యవసాయ అధికారులు,సహకార సంఘాల సీఈవోలు పాల్గొన్నారు.




# భౌ.. భౌ దాడులకు పాల్పడుతున్న గ్రామ సింహాలు

✍ **జయభేరి, దేవరకొండ :**

గ్రామ సింహాల (వీధి కుక్కల) హడావుడి అంతా అంతా కాదు.ఉదయం తెల్లవారుజాము నుంచే రోడ్లపై తిరుగుతూ కవర్లు, పేపర్ బాయ్స్, పాల ప్యాకెట్లు, అందించే వారిపై గ్రామ సింహాలు దాడులు చేస్తున్నాయి.దేవరకొండ పట్టణంలోని పదహారో వార్డులోనే వాసవి బజార్లో వీధి కుక్కలు స్వైర విహారం చేసి చిన్నారులపై విచక్షణారహితంగా దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన సంఘటన బుధవారం సాయంత్రం జరిగింది. ఒకేరోజు దాదాపు పదిమంది చిన్నారులను కుక్క కరిచిందని బాధితులు తెలిపారు. దేవరకొండ పట్టణంలో ముఖ్యంగా మూడో వార్డు,నాలుగో వార్డు, పదిహేనో వార్డులోని శాలిబండ, సంతోషిమాత కాలనీ, గాంధీ బజార్లో గ్రామ సింహాలు ఎక్కువగా ఉన్నాయని, అక్కడి నుండి ఒంటరిగా వెళ్లే చిన్నపిల్లల తల్లిదండ్రులు కుక్కల గురించి తీవ్ర భయాందోళనకు గురవుతున్నరు.



మున్సిపాలిటీ ఏరియాలలో శునకాలను పట్టుకొని ఇంజక్షన్లు లేదా శస్త్ర చికిత్సలు చేయవలసిన నిబంధనలు ఉన్నప్పటికీ మునిసిపల్ శాఖ నుండి ఎటువంటి చర్యలు చేపట్టడం లేదని పట్టణవాసులు వాపోతున్నారు. వీధి కుక్కల దాడులు తీవ్రం కాకముందే కుక్కల నియంత్రణ పై చర్యలు చేపట్టాలని, వీధి కుక్కల వెంటనే నివారణకు చర్యలు తీసుకొని రక్షణ కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.



# గుడ్ ఫ్రైడే.. క్రైస్తవులకు అత్యంత ముఖ్యమైన పర్వదినాల్లో ఒకటి

✍ **జయభేరి, దేవరకొండ :**

ప్రేమ, దయ, కరుణ, జాలి ఇవన్నీ మనల్ని మరింత ఉన్నతంగా మార్చుతాయని. ఆ ప్రభువు ప్రేమ ఎప్పుడూ మనపై ఉండాలని సెంటినరి యం.బి జాయిన్ చర్చ్ మిషన్ కాంపౌండ్ దేవరకొండ రెవరెండ్ కే. వేణు పాస్టర్ అన్నారు. గుడ్ ఫ్రైడే సందర్భంగా వారు మాట్లాడుతూ దేవరకొండ పట్టణ మరియు పరిసర ప్రాంత ప్రజలందరికీ గుడ్ ఫ్రైడే శుభాకాంక్షలు తెలుపుతూ క్రైస్తవులకు అత్యంత ముఖ్యమైన పర్వదినాలలో గుడ్ ఫ్రైడే ఒకటని, ఈ రోజు ఎంతో భావోద్వేగం కలిగిన రోజని, ఏసుప్రభువుకు శిలువ వేసిన రోజుకు గుర్తుగా, అప్పట్లో ప్రజల కోసం నిలబడిన,ప్రజా శ్రేయస్సు కోసం పాటుపడిన ఏసుప్రభు పై కక్షగట్టి అప్పటి పాలకులు అరాచకాలకు పాల్పడ్డారని గుర్తు చేసుకుంటూ ప్రతి సంవత్సరం క్రైస్తవులు గుడ్ ఫ్రైడే జరుపుకుంటారని అన్నారు. ఈస్టర్ (Easter) పండుగకు ముందు ఇది నిర్వహిస్తారని.. ఈ రోజున క్రైస్తవులు చర్చికి వెళ్లి ప్రార్ధనలు చేస్తారని ఏసు ప్రభువు త్యాగాలను స్మరించుకుంటారని తెలిపారు.గుడ్ ఫ్రైడే నాడు మాత్రమే కాదు ఎప్పుడూ మనమందరం ప్రేమ, దయ, మంచితనంతో ఉండేలా ఆ ప్రభువు ఆశీర్వదించాలని కోరారు.ప్రియమైన ప్రభువా ఈ ప్రపంచమంతా శాంతి, సౌభ్రాతృత్వాలతో మెలగాలని తెలిపారు.

# హైవేపై కంకర.. ఇబ్బంది పడుతున్న వాహనదారులు పాదాచారులు

✍ **జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ పట్టణంలోని మెయిన్ రోడ్డుపై గత వారం రోజుల నుండి నిత్యం కంకర పడి ఉండడం పై వాహనదారులు, పాదాచారులు తీవ్ర ఇబ్బంది కలుగుతుందని స్థానిక ప్రజలు వాపోతున్నారు. ఈ రోడ్డు గుండా వెళ్లే కంకర వాహనాలు సామర్థ్యానికి మించి కంకర వేసుకొని పోవడం వలన రోడ్డుపై పడుతుందని, ప్రతి రోజు మున్సిపాలిటీ పారిశుద్ధ్య సిబ్బంది రోడ్డు ఊకే సమయంలో తీవ్ర అసౌకర్యం కలుగుతుందని తెలిపారు. దీనితోపాటు రోడ్డుపై కంకర ఉండడంతో వాహనాలకు బ్రేకులు పడక అదుపుతప్పి కిందపడి పలువురు గాయాల పాలైన సందర్భాలు ఉన్నాయి.ఇకనైనా సంబంధిత అధికారులు కంకర వాహనాలపై చర్యలు తీసుకోని ప్రజల భద్రతను కాపాడాలని పాదాచారులు, వాహనదారులు కోరుతున్నారు.





పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 19వ డివిజన్ నందు నూతనంగా ఏర్పాటు చేసిన "దీప్తి ఫోటో ఫ్రేమ్స్ & క్రియేటివ్ కస్టమైజ్డ్ గిఫ్ట్స్" షాప్ ను మేయర్ జక్క వెంకట్ రెడ్డి, డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్, నాయకులు అలవాల దేవేందర్ గౌడ్, కుర్ర శ్రీకాంత్ గౌడ్ కలిసి ప్రారంభించి నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

✍ **జయభేరి, మేడిపల్లి**

# మెరుగైన సేవలు అందిస్తూ మరింత అభివృద్ధి చెందాలి


✍ **జయభేరి, మేడిపల్లి :**

పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని రాంచందర్ సింగ్ కాలనీ యందు జక్క దేవేందర్ రెడ్డి నూతనంగా ఏర్పాటు చేసిన "MRF హర్ష టైర్స్" షోరూమ్ ప్రారంభంభోత్సవ కార్యక్రమంలో MRF సంస్థ ప్రతినిధులు జాకబ్ సి జాకబ్, అమర్నాథ్, మేయర్ జక్క వెంకట్ రెడ్డి, బోడుప్పల్ మేయర్ సామల బుచ్చిరెడ్డి కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... MRF టైర్లు భారత దేశంలో అత్యుత్తమమైన మంచి నాణ్యతతో ఎక్కువ కాలం మన్నే కఠినమైన భూబాగాలను సైతం తట్టుకునే విధంగా ఉండటంతో MRF అంటే దేశంలో టైర్లకు దాదాపు పర్యాయపదంగా మారిందన్నారు. హర్ష టైర్స్ తమ వినియోగదారులకు మెరుగైన సేవలు అందిస్తూ మరింత అభివృద్ధి చెందాలని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కాటేపల్లి జనార్ధన్ రెడ్డి, డిప్యూటీ మేయర్ కుర్ర శివ కుమార్ గౌడ్, బీఆర్ఎస్ అధ్యక్షులు దర్గా





దయాకర్ రెడ్డి, మంద సంజీవ రెడ్డి, కార్పొరేటర్లు సుభాష్ నాయక్, మద్ధి యుగంధర్ రెడ్డి, కౌడే పోచయ్య, ఏంపల్ల అనంతరెడ్డి, పద్మారెడ్డి, కో ఆప్షన్ ఇర్ఫాన్,నాయకులు బండారి రవీందర్, లేతాకుల రఘుపతి రెడ్డి, కుర్ర శ్రీకాంత్ గౌడ్, ఆలవాల దేవేందర్ గౌడ్, పప్పులు అంజిరెడ్డి, జావీద్ ఖాన్, ఏనుగు మనోరంజన్ రెడ్డి, రఘువర్ధన్ రెడ్డి, హాజరై శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది.




# మూవీభేరి




## ‘తలైవా 171’ ఫస్ట్ లుక్ వచ్చేసింది

తమిళ సూపర్‌స్టార్ రజినీకాంత్ లియో ఫేమ్ లోకేష్ కనగరాజ్ కాంబోలో ఓ మూవీ రానున్న విషయం తెలిసిందే. తలైవా 171గా ఈ సినిమా రాబోతుండడంతో ప్రాజెక్ట్ ఎలా ఉండబోతుందోనని ఫ్యాన్స్ అంతా ఎక్జయిటింగ్‌గా చర్చించుకుంటున్నారు. ఇదిలావుంటే ఈ మూవీ నుంచి లోకేష్ సాలిడ్ అప్‌డేట్‌ను పంచుకున్నాడు. ఈ మూవీ నుంచి రజినీకాంత్ ఫస్ట్ లుక్‌ను లోకేష్ కనగరాజ్ ఎక్స్ వేదికగా విడుదల చేశాడు. ఇక ఈ పోస్టర్‌లో రజినీకాంత్ లగ్జరీ వాచ్‌లు దొంగతనం చేసే దొంగలా కనిపిస్తున్నాడు. ఇక ఈ సినిమా టైటిల్‌ను ఏప్రిల్ 22న విడుదల చేయనున్నట్లు లోకేష్ తెలిపాడు. ఈ చిత్రాన్ని లీడింగ్ ప్రొడక్షన్ హౌజ్ లైకా ప్రొడక్షన్స్ తెరకెక్కిస్తోండగా.. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నాడు. ఈ సినిమా షూటింగ్‌కు సంబంధించి రీసెంట్‌గా ఒక ఇంటర్వ్యూలో పాల్గోన్న లోకేష్ మాట్లాడుతూ.. రజినీకాంత్‌తో కలసి వర్క్ చేయడానికి ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను. తలైవా 171 నాకెంతో ప్రత్యేకమైనది. షూటింగ్ మొదలుపెట్టడానికి, ప్రీప్రొడక్షన్ వర్క్ పూర్తి చేయడానికి కొంత సమయం పడుతుంది. జూన్‌లో ఈ సినిమా సెట్స్‌పైకి వెళ్లే అవకాశాలున్నాయి. ఏడాదిన్నరలో ఈ సినిమా పూర్తి చేసి ఆ తర్వాత ‘ఖైదీ 2’ మొదలుపెడతాను అంటూ లోకేష్ వెల్లడించాడు.



## సినిమా అంతా సర్‌ప్రైజ్‌లూ షాక్‌లూ నవ్వులే..

‘నేను చూసిన అనుభవాల నుంచి పుట్టుకొచ్చిన ఆలోచనే టిల్లు పాత్ర. టిల్లుకీ నాకూ ఒకటే తేడా. వాడు తన మనసులోవన్నీ బయటకు అంటాడు. నేను మనసులో అనుకుంటాను.’ అంటున్నారు యువహీరో సిద్ధు జొన్నలగడ్డ. ఆయన కథానాయకుడిగా మల్లిక్‌రామ్ దర్శకత్వం వహించిన చిత్రం ‘టిల్లు స్వేర్’. ఈ సినిమాకు కథనం, మాటలు కూడా సిద్ధు జొన్నలగడ్డే అందించారు. అనుపమా పరమేశ్వరన్ కథానాయిక. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్‌ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ చిత్రం ఈ శుక్రవారం విడుదల అవుతున్నది. ఈ సందర్భంగా సిద్ధు విలేకరులతో ముచ్చటించారు. ‘డీజే టిల్లు’ సమయంలో టిల్లు కేరక్టర్‌పై ప్రేక్షకుల్లో అంచనాలు లేవు. సినిమా చూసి సర్‌ప్రైజ్ అయ్యారు. ఇప్పుడు టిల్లు మరోసారి వస్తున్నాడంటే అంచనాలు పీక్స్‌లో ఉంటాయి. అందుకే కాస్త ఒత్తిడి ఎక్కువగానే ఉంది. ఆ ఒత్తిడిని అధిగమించి మెరుగైన అవుట్‌పుట్ ఇవ్వడానికి ట్రై చేశాం. ‘డీజే టిల్లు’ కథ, పాత్ర.. రెండూ కొనసాగింపుగా ‘టిల్లు స్కేర్’ ఉంటుంది. పాత కథను గుర్తు చేస్తూ కొత్త అనుభూతినిచ్చే సినిమా ఇది. ‘టిల్లు’ కూడా ఇందులో ఫస్ట్ పార్ట్‌కంటే ఎనర్జిటిక్‌గా ఉంటాడు. ఇందులో ఇంకా పెద్ద సమస్యలో ఇరుక్కుంటా డు. సినిమా అంతా సర్‌ప్రైజులు, షాక్‌లే. తెరపై టిల్లు అస్సలు నవ్వడు. ప్రేక్షకులు మాత్రం పొట్టచెక్కలయ్యేలా నవ్వుతూనే ఉంటారు. సినిమా కూడా ఎక్కువ నిడివి ఉండదు. సినిమాకు ఎంత అవసరమో అంతే ఉంటుంది. ఎక్కడా బోర్ కొట్టదు. అనుపమ పాత్ర ఇందులో చాలా బావుంటుంది. తొలిపార్ట్‌లో హీరోయిన్‌కి ఎంత ప్రాముఖ్యత ఉందో ఇందులో అనుపమ పోషించిన లిల్లీ పాత్రకు కూడా అంతే ప్రాధాన్యత ఉంటుంది. దర్శకుడు మల్లిక్‌రామ్ అద్భుతంగా మలిచాడు. మా కలయికలో టిల్లూ సీక్వెల్ రావడం చాలా ఆనందంగా ఉంది. త్రివిక్రమ్‌గారు కథ విషయంలో ఎప్పుడూ జోక్యం చేసుకోలేదు. బాగా రావడానికి కొన్ని సలహాలు ఇచ్చేవారు. టిల్లు 3 కూడా ఐడియా ఉందికానీ, ముందు ఓ విభిన్నమైన కథ రాసే పనిలో ఉన్నాను. అది చేశాక టిల్లు 3 గురించి ఆలోచిస్తా. ఈ సినిమాకు మాటలు రాయడం గొప్ప అనుభవం. ముఖ్యంగా నా పాత్రకు నేనే డైలాగులు రాసుకోవడం నటుడిగా నాకు బాగా కలిసొచ్చింది. ఆ డైలాగులు నా మెదడు నుండి పుట్టాయి కాబట్టి, ఏ ఉద్దేశంతో రాశానో నాకు తెలుసు కాబట్టి, విత్ ఎక్స్‌ప్రెషన్‌తో డైలాగ్ పలకడం తేలికైపోయింది. అలాగే ఇందులో సంగీతం కూడా హైలైట్. డీజే టిల్లుకి థమన్ నేపథ్య సంగీతం ఎంత ప్లస్ అయ్యిందో, ‘టిల్లు స్కేర్’కి భీమ్స్ సంగీతం అంత ప్లస్ అవుతుంది.



## ఆ సినిమానే నన్ను మార్చింది

ప్రియమణి సెకండ్ ఇన్నింగ్స్ అభినందనీయంగా ఉంది. ఆమె బాలీవుడ్‌లో నటించిన ‘ఆర్టికల్ 370’ చిత్రం ఇటీవలే విడుదలై విమర్శకుల ప్రశంసలందుకుంటున్నది. ఏప్రిల్ 10న అజయ్‌దేవగణ్‌తో ఆమె నటించిన ‘మైదాన్’ కూడా విడుదల కానుంది. ఫుట్‌బాల్ కోచ్ సయ్యద్ అబ్దుల్ రహీం జీవితం ఆధారంగా అమిత్‌శర్మ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో ప్రియమణి కీలక పాత్ర పోషించింది. ఈ సినిమా ప్రమోషన్‌లో భాగంగా మీడియాతో ఆసక్తికరంగా మాట్లాడింది ప్రియమణి. ‘కెరీర్ తొలినాళ్లలో ఏది తప్పో ఏది ఒప్పో తెలిసేది కాదు. వచ్చిన ప్రతి పాత్రకూ ఒప్పుకునేదాన్ని. ‘పరుత్తివీరన్’ నటిగా నా దృక్పథాన్ని మార్చింది. ఆ సినిమాతో జాతీయ అవార్డు అందుకున్నాను. అప్పట్నుంచి స్వీయవిమర్శను అలవరచుకున్నాను. కొత్తగా చేయాలనే తపన మొదలైంది. కథలు ఎంచుకునే తీరు మారింది. ఇప్పుడు నా వయసుకు తగ్గ పాత్రలు చేస్తున్నాను. నటిగా నా బాధ్యత మరింత పెరిగినట్టుగా ఉంది’ అంటూ చెప్పుకొచ్చింది ప్రియమణి. అజయ్‌దేవగణ్‌తో కలిసి ‘మైదాన్’లో నటించడం పట్ల ఆమె ఆనందం వ్యక్తం చేసింది. అజయ్‌దేవగణ్‌ను ఓ అద్భుతంగా ఆమె అభివర్ణించింది. కళ్లతోనే అన్ని భావాలూ పలికించగల అద్భుతమైన నటుడు అజయ్‌దేవగణ్ అనీ, రేపు ‘మైదాన్’లో ఆయన్ను చూసి ప్రేక్షకులు ఆశ్చర్యపోతారని తెలిపింది ప్రియమణి.

Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com